
# ప్రతిజ్ఞ

పోల్కంపల్లి శాంతాదేవి



"ఏమడోంయ్., సరస్వతి గారూ! ఇవాళ పేపర్లో బి.ఎ. ఫైనల్ రిజల్ట్స్ పడ్డాయిగా? మీ సుధ పాసైందా?" ప్రక్కింటి విజయలక్ష్మి పెరటి గోడదగ్గర నిలబడి అడిగింది.

నూతిలోంచి నీళ్ళుతోడుతున్న సరస్వతి నీళ్ళుతోడడం ఆపి, "పాసవడమేమిటీ, డిస్టింక్షన్‌తో పాసైతేనో! మరి మీ అబ్బాయో? అనడిగింది, గోడదగ్గరికివస్తూ.

"అడక్కండి! పేపరులో నంబరు చూచుకొనే యోగంలేదు మాకు: ఈ కాలం లో చదువుల మీద ఆడపిల్లలకుండే శ్రద్ధ, పట్టుదల మగపిల్లలకి లేకుండా పోతూందండీ! ఈసినిమాల పిచ్చిలో షికార్ల పిచ్చిలో మగపిల్లల బుర్రలు మట్టి కొట్టుకు పోతున్నాయి: ఆవిడ ఓ గాఢమైన నిట్టూర్పు విడిచింది.

"మీసుధని ఇంకా చదివిస్తారా?" ఇంతటితో ఆపేసి పెళ్ళి ప్రయత్నాలేమైనా మొదలెడతారా?"

"చదివించే కొద్దీ ఇంకా ఎక్కువ చదివిన మొగుడిగా తీసుకు రావలసిందేకదా? దీన్ని ఇంకా చదివించాలన్నా దీనికంటే ఎక్కువ చదివినవాడిని మొగుడిగా తీసుకు రావాలన్నా మాతాహతుకు మించిన పని కదండీ! ఇంక చదివించం లెండి; పెళ్ళి ప్రయత్నాలే మొదలెట్టాలి!

"కనీసం ఎం.ఎ. చదివినవాడినో, దానికి సమానంగా చదివినవాడినో తేవాలంటే ఓ పాతిక వేలయినా పట్టుకుతిరగాలి" అవునా?

"ఈ కాలంలో ఎం.ఎ. చదివినవాడు పాతిక వేలలో దొరికితే అదృష్టంగా చెప్పుకోవాలి; అదే బెంగ మాకిప్పుడు! మొన్నటిదాకా పెద్ద దాని పెళ్ళిబాకి తీర్చడంతోనే సరిపోయింది. ఎన్ని కోరికలను సమాధి చేసుకొంటే ఆ అప్పు తీర్చగలిగామో ఆ భగవంతుడికే తెలుసు! మళ్ళీ దీని పెళ్ళికి అప్పు చేయాలంటే గుండె జల్లుమంటూంది. ఈ వరకట్నం అనే ఆచారాన్ని ఎవడు మొదలు పెట్టాడోగాని, మధ్య తరగతి కుటుంబాలు ఎన్నో నేలమట్టం అయిపోతున్నాయి;"

"మీ అర్జున్‌కి పెళ్ళీడే కదా ఇప్పుడు? అతడికి తీసుకొని ఈ మెకిస్తే అంత భారం పడదు లెండి మీ మీద!"

"ఉద్యోగం దొరికే వరకు పెళ్ళిచేసుకోనని పట్టు బట్టాడు! వాడికిప్పట్లో ఉద్యోగం దొరికే ఆశలేనట్టే వాడికొచ్చే కట్నం తీసి సుధకి సైమన్న ఆశాలేదు: మాతిప్పలు మేంపడాలి"

"నా పెళ్ళి కోసం ఏంతిప్పలు పడొద్దని ఎన్ని సార్లో చెప్పాను కదమ్మా?" ఇంట్లోంచి తారాజువ్వలా వచ్చింది సుధ. కట్నం తీసుకొనే వాడిని నేను చస్తే పెళ్ళాడనని ఎప్పుడో ప్రతిజ్ఞ చేసుకొన్నా: నాపెళ్ళి గురించి మీరేం దిగులు పడొద్దు!"

"దిగులు పడొద్దు అన్నంత మాత్రాన దిగులు పడకుండా, ఉంటారా. సుధా?" నువ్వు ప్రతిజ్ఞ పూనినంత మాత్రాన, నిన్ను కట్నం లేకుండా చేసుకొనే వాడురావద్దూ?" అంది విజయలక్ష్మి,

"వచ్చినప్పుడే అవుతుంది నా పెళ్ళి! నా పెళ్ళి గురించి ఎవరూ దిగులుపడక్కరలేదు!"

"ఊరంతా ఒక దారి, ఉలిపికట్టెదొక దారి అన్నట్టుగా అవుతుంది నీ కథ! నువ్వొక్కదానివి ప్రతిజ్ఞ పూని ఏం సాధించాలని? నువ్వు చూస్తుండగానే నీ తోటి పిల్లల పెళ్ళిళ్లే కాదు, నీ కళ్ళ ముందు పుట్టిన పిల్లల పెళ్ళిళ్ళు కూడా అయిపోతాయి; నువ్వూ నీ ప్రతిజ్ఞా మిగిలిపోతారు! ఇలా ముఖం మీదే అంటున్నానని అనుకోవద్దు నీ ప్రతిజ్ఞ వల్ల జరిగేదేమిటో చెబుతున్నాను!" అంది విజయలక్ష్మి కాలజ్ఞానం చెబుతున్నట్టుగా.

"నేనొక్కదాన్ని ప్రతిజ్ఞ పూనడం కాదు, విజయాంటీ! నా తోటి పిల్లల్ని కూడా ఇదే ప్రతిజ్ఞ తీసుకోమని చెబుతాను. ఓ పది మంది చేత ఈ ప్రమాణం చేయించినా నా చిన్ని జీవితం ధన్యమైనట్టే!"

పది మంది దాకా ఎందుకు? ఒక్కదాని చేత 'కట్నం తీసుకునే వాడిని పెళ్ళాడ'నని ప్రతిజ్ఞ చేయించు! చాలు! అలా ప్రతిజ్ఞ చేయించిన కాగితం ఒకటి తెచ్చి నాకు చూపెట్టు! దీనికి నీకు నెల రోజులు గడువు ఇస్తున్నాను!" ఛాలెంజి చేసింది విజయలక్ష్మి.

రోషంతో ఎరుపెక్కిన ముఖంతో ఆ ఛాలెంజిని స్వీకరించింది సుధ.

ం ం ం

సుధకి ప్రాణస్నేహితురాలు వనజ. ఇంటర్ నుండి డిగ్రీ పూర్తి చేసేవరకు సహాధ్యాయిని. ముందు ఆమెతో తన కార్యక్రమం మొదలుపెట్టదలచుకొని, ఆ రోజు వాళ్ళింటికి వెళ్ళింది సుధ.

"రా, రా! నూటికి నూరేళ్ళు ఆయుష నీకు!" సంతోషంగా ఆహ్వానించింది వనజ.

"నీ మాటే అనుకుంటున్నాను! ఇవాళ నీకు కబురు చేయాలని!" అంది స్నేహితురాలి చెయ్యి పట్టుకొని మేడ మీదికి దారి తీస్తూ.

"ఏమిటి విశేషం?" సుధ అడిగింది.

"ఇవాళ నన్ను చూచుకోడానికి పెళ్ళివాళ్ళు వస్తున్నారు. ఇలాంటి వేడుకలప్పుడు చెలికత్తెలుంటే బాగుంటుంది కదాని!"

"దేనికి వరుడిని శల్యపరీక్ష చేసి రిజల్ట్ చెప్పడానికా?"

అవునే పెళ్ళి కూతురి స్థానంలో ఉండి

వరుడిని నిర్భయంగా చూడడం కుదరదు కదా!"

"ఎందుకు చూడకూడదు నిర్భయంగా? అతడు నిర్భయంగా నీ ముక్కూ, మూతి, శరీరం మొత్తం కొలతలు తీసుకొన్నప్పుడు నువ్వెందుకు తీసుకోకూడదు?"

"ఛ! మరీ అలా బరితెగించినట్టుగా ఎవరు చూస్తారే? చూశామే అనుకో, ఎంత సిగ్గూ, లజ్జా లేనిది అనుకోరూ?"

"అయితే నీ కళ్ళకు గంతలు కట్టి అతడిని చేసుకోమన్నా చేసుకుంటావా?" విస్మయంగా అడిగింది సుధ

"ఇప్పుడు కళ్ళకి గంతలు లేకపోతే కదా?" వనజ ముఖం మబ్బులు ముసిరినట్టుగా అయింది. "కాలాన్ని బట్టి అనుకొంటూ మనల్ని మన తల్లిదండ్రులు చదివిస్తున్నారే కాని మనకి ఓ వ్యక్తిత్వం, మనకంటూ ఓ ఆలోచన ఎక్కడ రూపుదిద్దుకోనిస్తున్నారు? పెళ్ళి దగ్గరికి వచ్చేసరికి మనకస్సలు స్వతంత్రమివ్వడం లేదు కదా! సంబంధం చూసేది వాళ్ళే మంచి చెడ్డలు విచారించేది వాళ్ళే! వాళ్ళకిహ నచ్చిందా మనం ఏ అభ్యంతరం చెప్పినా సహించరు. లక్ష్యపెట్టరు. మెడలో ఆ మూడుముళ్ళు వేయించి వాడి వెంట పంపిస్తారు. ఇహ స్వర్గమైనా, నరకమైనా అక్కడే. మళ్ళీ ఇక్కడ అడుగుపెట్టడానికి అధికారముండదు కదా? ఎప్పుడైనా వస్తే అడపడుచుగా పసుపు కుంకుమలు తీసుకోడానికి రావలసిందే."

'స్వర్గమైనా నరకమైనా అక్కడే!'

ఆ మాట మాత్రం తన అక్క రాధ విషయంలో ఎంత యధార్థమైంది!

రాధ భర్త దగ్గర పడే కష్టాలు గుర్తు వచ్చి సుధ మనస్సంతా ఎలాగో అయిపోయింది వారింట అడుగు పెట్టిన మరునాటి నుండే కష్టాలు ప్రారంభమయ్యాయి రాధకు, ఉదయం లేవగానే టూత్ బ్రష్ మీద పేస్ట్ వేసి అందివ్వటం దగ్గర నుంచి, ఆఫీసు నుండి ఇంటికి వచ్చాక బూట్లు విప్పడం దాకా చేయాలి! ఎక్కడ పొరపాటొచ్చినా నేనూ మనిషినే అని ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుని జవాబిచ్చినా కళ్ళెర్రబడిపోయి ముక్కుపుటాలు ఉబ్బిపోయి పూనకం వచ్చినట్టుగా ఊగిపోయి చేతికి అందుబాటులో ఏదుంటే దానితో ఎడా పెడా వేస్తాడు.

'ఆయనతో కాపురం చేయలేను' అంటూ రెండుసార్లు అతడితో చెప్పకుండా పారిపోయి వచ్చేసింది రాధ.

"చేయలేను అంటూ వచ్చేస్తే ఎలాగమ్మా! ఆ తరువాత ఏమిటని ఆలోచించుకోవాలిగదా? ఎప్పటికీ మేం ఉండంకాదా? పాతవాళ్ళం పోయికొత్త వాళ్ళు వస్తారు, వాళ్ళు నిన్నెందుకు ఆదరంగా చూస్తారు? మొండి చెట్టాన్ని చూసినట్టుగా చూస్తారు! ముష్టిదాన్ని చూసినట్టుగా చూసినా ఆశ్చర్యం లేదు: అప్పుడు ఆ నరకం కంటే, ఆ అవమానంకంటే ఇప్పుడు భర్త దగ్గర పరిస్థితే ఎంతో మెరుగనిపిస్తుంది! ఇప్పుడిలా వచ్చేసి అప్పుడు వెళ్ళడానికి ఆ దారీ ఉండదు, అతడు మళ్ళీ పెళ్ళి చేసుకొన్నాడంటే; మంచివాడో చెడ్డవాడో మగడి దగ్గరున్న సుఖం పెళ్ళయిన ఆడదానికి ఎక్కడ దొరుకుతుంది?... అయినా మగడిని మార్చుకోడానికి ఆమాత్రం తెలివి తేటలు లేవేమే? ఇవాళున్న దూకుడు ఎల్లకాలం ఉంటుందా? ఎదురింటి సుభద్ర మొగుడు పెళ్ళయిన క్రొత్తలో ఆమెను చావగొట్టేవాడట! ఇప్పుడు చూడు పెళ్ళాం ఎంత చెబితే అంత! ఇప్పుడు కొంచెం ఓర్పు పట్టాలబ్బా!" అని నీతులు బోధించింది తల్లి.

"నీ పెళ్ళికి ముప్పైవేల అప్పయింది! అష్టకష్టాలుపడి అప్పు తీరుస్తున్నాం. అప్పైనా సరే పిల్లను ఓఅయ్యచేతిలో పెట్టామన్న నిశ్చింత. ఆ నిశ్చింత మాకులేకుండా చేస్తావా? ఇంకా పెళ్ళికి నీ చెల్లెలు ఉండనే ఉంది! మళ్ళీనువ్వొచ్చేసి కూర్చుంటే మేం ఎక్కడ చావం? అయినా కూతురు కాపురం వదులుకు వచ్చేసిందంటే ఎంత అప్రదిష్ఠ? చిన్నదానికి సంబంధం వస్తుందా?" ఇలా సాగింది తండ్రి ఉపన్యాసం.

కూతురికే నచ్చచెప్పి భర్తదగ్గరికి పంపిందారుగాని 'ఇదేమిటి? పిల్లనుగొడ్డులా బాదేస్తున్నావట! భార్య అనుకొన్నావా, బానిస అనుకొన్నావా?' అని వెళ్ళి ఒక్కమాటా అడగలేదు అల్లుడిని. ఏమడిగితే ఏంకోపం వస్తుందో, ఆ కోపం మళ్ళీ పిల్లమీదే కదా చూపేది అనుకొన్నారు!

పెళ్ళికాక ముందు ఎంతో చలాకీగా ఉండే రాధ పెళ్ళయిన ఈ రెండేళ్ళలో ఉత్సాహం ఊదేసినట్టుగా, వట్టి బెదురుగొడ్డులా తయారైంది.

అదంతా తలచుకొంటూంటే సుధకి కళ్ళలో నీళ్ళొచ్చేశాయి!

"నరకమైనా అక్కడే ఎందుకు పడుండాలో నాకు అర్థంకాదు, వనజా! ఏకారణం చేతైనా భర్తతో కాపురం చేయలేకపోయిన స్త్రీ మరోలా ఎందుకు బ్రతకడానికి ప్రయత్నించకూడదు?"

"ఎందుకంటే అలాంటి స్త్రీతో మన సంస్కృతి సంప్రదాయాలు యుద్ధభేరి మ్రోగిస్తాయి కనుక! భర్తదగ్గర తప్ప నీకెంక్కడా చోటులేదని తరిమి తరిమి కొడతాయి కనుక!"

"అతడితో క్షణం క్షణం నరకమైనా, క్షణం క్షణం చస్తూన్నా అక్కడే ఉండాలని చెప్పే సంస్కృతి ఏమిటి? సంప్రదాయం ఏమిటి? వాటిని నేలంటు సమాధి చేసేయాలి!" సుధ ఆవేశంగా అంది.

"ప్రస్తుతం మన స్థితిలో మార్పురాదు గాని, సాయంతరం వాళ్ళొచ్చేదాకా ఉంటావా? వెళ్ళి మళ్ళీ వస్తావా?"

"ఉంటానో, తరువాత వస్తానో గాని అబ్బాయిని కొంటున్న ధరెంత?"


"కొనడమేమిటి నీ మొహం!"

"వరకట్నం ఎంత అని!"

"అతడి వివరాలు చెప్పలేదుకదూ? బి.ఇ. పాసై స్టేట్స్‌కి వెళ్ళబోతున్నాడు. నాలుగు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి ఉందట. దీన్నిబట్టి చెప్పు ఎంతుంటుందో?"

"సుమారుగా లక్ష అయినా ఉంటుంది! కాని, నాకేం తక్కువని దబ్బిచ్చి మగణ్ణి





కొనుక్కోడం? చదువుంది. సంప్రదాయముంది? ఇవిచాలవా ఒక మంచి వరుడిని సంపాదించి పెట్టడానికి?"

"పిచ్చిదానివి! అందరికీ ఇవిలేక వరకట్నాలు గుమ్మరిస్తున్నారంటావా? వరకట్నం అంటూ అలా పడిపోయింది. ఏం చేస్తాం? అందరూ ఇస్తూ మనం ఒక్కరం ఇవ్వక పోతే, అందరి పెళ్ళిళ్ళు అయిపోయి మనం ఒక్కరం మాత్రం పెళ్ళిపెటాకులు లేకుండా మిగిలిపోతాం! అలాంటి జీవితం ఎంతమంది ఆడపిల్లలు కోరుకొంటారో చెప్పు? అందరికీ పెళ్ళికావాలని, చక్కగా కాపురం చేసుకోవాలని కలలుంటాయి! ఎవరు మాత్రం అవివాహితంగా ఉండిపోడానికి ఇష్టపడతారు?"

"ఎంత స్వార్థంగా మాట్లాడుతున్నావు, వనజా?" విస్మయంగా అంది సుధ. "అందరూ ఇచ్చిచేసుకొంటున్నారు, మనమూ ఇచ్చి చేసుకొందాం అనికాదు మనం సమర్థించుకోవలసింది? ఎవరిచ్చి చేసుకొన్నా, నేను ఇచ్చిచేసుకోను! అని ప్రతి ఆడపిల్లా ప్రతిన పూనినప్పుడుగాని, ఈ వరకట్న పిశాచాన్ని పడగొట్టలేం! నీవంతు దెబ్బ ఒకటి వెయ్యి! నావంతు దెబ్బ నేను వేస్తాను! ఇలా ఎవరి దెబ్బ వాళ్ళు వేయగలిగితే ఈ పిశాచం మొదలంటూ కూలదా?"

'ప్రస్తుతం మనమున్న పరిస్థితిలో మనం వేసే దెబ్బ దానికి తగులుతుందో లేదోగాని, ముందు ఆదెబ్బ మన జీవితానికి తగిలి మొదలంటూ నరకబడతాం! అంత త్యాగం నేను చేయలేనుగాని, సాయంత్రం వస్తావా?'

'నేను చస్తేరాను!' సుధ చివ్వునలేచింది. "నేనుఈ క్షణం నుండి వరకట్నంతో జరిగే పెళ్ళిళ్ళను కూడా బహిష్కరిస్తున్నాను. నీ పెళ్ళిచూపులకుకాదు, నీ పెళ్ళికికూడా నేను రాను!" బ్యాగ్ భుజానికి తగిలించుకొని విసవిసనడుస్తున్న సుధకు "ఇదేం పిచ్చి దీనికి! చదువులో ఫస్ట్‌క్లాస్‌రాని లౌక్యంలో చాలా వెనుకబడి ఉంది!" అని వనజ గొణుక్కోవడం వినిపించింది.

"రా, సుధా!.... డిస్టింక్షన్‌తో పాసయ్యావు! ఎం.ఏ. చేస్తున్నావా?" అడిగింది రాణి.

"ఎం.ఏ.కి అప్లై చేయాలనే అనుకుంటున్నాను. మరినువ్వు?" అడిగింది సుధ.

"బి.ఏ. ఎగ్జామ్స్ వ్రాసిన మరురోజు నుండి మా వాళ్ళు పెళ్ళి సంబంధాలకోసం తీవ్రంగా గాలింవేస్తున్నారు! గోత్రాలు, జాతకాలు అన్నీకలిసిన సంబంధం ఒకటి చిక్కింది? వచ్చేవారంలో పెళ్ళిచూపులు!"

"ఇక చదవవా?"

"ఇంకా చదివి ఏంచేస్తామే? పెళ్లి చేసుకొని వంటింటికీ, పడకటింటికీ పట్టాభిషేకం చేసుకొనే పాటికి ఇంకా చదువెందుకు? ఈ బి.ఏ.నే వేస్ట్ అనుకొంటున్నాను!"


"ఎంత దారుణంగా మాట్లాడుతున్నావు, రాణీ?"

"దారుణం ఏముందే? ఉన్న సంగతి చెబుతున్నాను! ఎంత చదివినా ఆడదానికి వంట చెయ్యక తప్పుతుందా? పిల్లల్ని కనక తప్పుతుందా?"

"వంటచెయ్యి! పిల్లల్ని కను! అది నామోషీ ఏంకాదు! కాని, ఎక్కడ నిన్ను అణిచి వేస్తున్నాడో, ఎక్కడ నిన్ను దోపిడి చేస్తున్నాడో ఎక్కడ నీకు వ్యక్తిత్వం లేకుండా చేస్తున్నాడో అది గుర్తించు! అది గుర్తించాలంటే ఆడదానికి చదువుండాలి! ఆ చదువెందుకంటే- ఎంత మూర్ఖవాదన!"

"గుర్తించిన వాళ్ళంతా ఏంచేస్తున్నారు? మగవాడి పాదాల దగ్గరే పడిఉన్నారుకదా?"

"ఎక్కడో నీలాంటి నీరసపు దద్దమ్మలు తప్ప ఎవరూ పడిఉండడంలేదు! తమ వ్యక్తిత్వం నిలబెట్టుకోడానికి పోరాటం సాగిస్తున్నారు! మగవాడి అజమాయిషీ తిరస్కరించి, స్వతంత్రంగా జీవించడాన్ని ప్రయ

శ్నిస్తున్నారు!"

"ఎందుకొచ్చిన పోరాటం! మగవాడిని బహిష్కరించి జీవితంలో మనం బావుకునేది ఏముంది చేయి చేయికలుపుకొని సాగిపోవ డంలో ఉండే ఆనందం, చేతులు పిడికిళ్ళుగా మార్చి ముష్టియుద్ధానికి తయార వ డం లో ఉంటుందా? నీకూనేను సలహా ఇస్తున్నాను! మగవాడితో పేచీకి దిగొద్దు! వికటంగా,విప రీతంగా ఆలోచించి జీవితాన్ని వక్రమార్గం పట్టించకు!"

"నీసలహాకు థ్యాంక్స్" సుధ కోపంగా అంది 'ఎంత ధరపెట్టి వరుడిని కొనడానికి సిద్ధంగా ఉన్నారు మీవాళ్ళు?'

"రెండు లక్షలు!"

"మగణ్ణి కొనుక్కోడానికి సిగ్గులేదూ?"

"అందరూ చేస్తున్న పని మనం చేస్తు న్నప్పుడు సిగ్గెందుకు?"

ఇంకేం మాట్లాడాలనిపించలేదు సుధకు.

ం ం

"హాయ్, సుధా; రారా! సినిమాకెళ్ళ డానికి కంపెనీ లేరే అనిచూస్తున్నాను! దేవుడు పంపించినట్టుగా వచ్చావు!" సుధని చూసి మహా సంతోషపడిపోయింది స్వప్న.

"బి. ఏ. అయిపోయిందికదా? చదువా, పెళ్ళా?" అడిగింది సుధ కూర్చుంటూ.

"మా వాళ్ళు సంబంధందొరికితే పెళ్ళి చేయాలని అనుకుంటున్నారు. పెళ్ళికి నా అభ్యంతరం ఏం లేదుకాని చదువు మాత్రం ఆపను పెళ్ళి అయినా, కాకపోయినా. ఎం. ఏ. పూర్తి చేసి తీరాలి!"

"వరకట్నం మీద నీ అభిప్రాయం ఏమిటి?

"అది మధ్యతరగతి వాళ్ళను ఇంకా క్రింది వాళ్ళను అడగాల్సిన ప్రశ్న! వర కట్నం మాబోటి లక్షాధికార్లకు ఒక సమస్య కాదు!"

"మీ బోటివాళ్ళకి సమస్య కాకపోయినా అదొక దురాచారమనైనా ఒప్పుకొంటావా?"

"ఇవ్వగలిగిన వాళ్ళకు అది సదాచారమే! లేనివాళ్ళకు దురాచారం కావచ్చు!"

"ఎంతకు బేరమాడుతున్నారు నీకు మగణ్ణి?" కసిగా అడిగింది సుధ.

"లక్షకు తక్కువుండదు!"

"ఉన్నవాళ్ళు కట్నరాక్షసికి తిండి పుష్టి కలిగిస్తూంటే మా బోటి వాళ్ళ పోరాటం ఎంత అర్థరహితమౌతుందో తెలుసా?"

"కట్నం లేకుండా పెళ్ళి చేసుకొమ్మం టావా? మా వాళ్ళకు ఇవ్వగలిగిన స్తోమత ఉన్నప్పుడు నేనెందుకు వట్టి చేతులతో ఈ గడపదాటాలి? నాకు అక్కయ్యలు ముగ్గురు. వాళ్ళు ఈ క్షణంలో వేరు పడినా తలా పది లక్షల ఆస్తికి తక్కువరాదు! మా అక్కయ్య లక్ష కట్నంతో, కానుకలు లాంఛనాలంటూ మరో ఏభైవేలు ఖర్చు పెట్టించి వెళ్ళింది. మరి నేనొక్కదాన్ని ఏం పాపం చేసుకొన్నాను? నేనెందుకు వట్టి చేతు లతో వెళ్ళాలి? ఒక సరాయింట కోడలిగా, భార్యగా అడుగుపెట్టి జీవితం స్థిరపరుచు కోడానికి వెడుతూ వట్టి చేతులతో వెళితే ఏం మర్యాదగా ఉంటుంది చెప్పు! మన ఇంటికి వచ్చే చుట్టమే వట్టి చేతులతో రాకూడదా! పండో ఫలమో పట్టుకువస్తాడు! అలాగే ఇదీ! బేరం, కొనడం అమ్మడం అని పేరు పెట్ట డం ఎందుకు? సరేగాని, నాతో సినిమాకు వస్తున్నావా లేదా? టిక్కెట్లు నేనే తీసు కొంటాలే!"

"నేనెప్పుడూ ఊహించనైనా ఊహించని సినిమా చూశాను ఇక్కడ! వేరే సినిమా చూసే ఆసక్తి చచ్చిపోయింది. వస్తాను!" అని విసురుగా లేచింది సుధ, "నీ పెళ్ళి కుదిరితే నీ పెళ్ళి శుభలేఖ నాకు పంపక్కర లేదు! ఎందుకంటే, కట్నాలకు అమ్ముడు పోయే, కొనే పెళ్ళిళ్ళను నేను బహిష్క రించాను కనుక!" సుధ చరచరా బయటికి





వచ్చింది.

ం ం ం

"వరకట్నం పేరు వింటే నాకూ నీలాగే కసిపుడుతుంది! ఆవేశం రేగుతుంది, వర కట్నం ఇచ్చి చస్తే చేసుకోకూడదను కొంటాను! కాని, కట్నం ఇవ్వకపోతే మనల్ని పెళ్ళెవరు చేసుకొంటారు చెప్పు?" అంది జ్యోతి. సుధతో పాటు ఇంటర్ వరకూ చదువుకొంది జ్యోతి,

"పెళ్ళి కాకపోతే చస్తామా?" సుధ చురుగ్గా అడిగింది.

"చావం! కాని బ్రతికిచస్తూ ఉంటాం! ఎందుకంటే వయసొచ్చాక ఒంటరిగా గడపడ మనేది సృష్టి విరుద్ధం! సృష్టికి విరుద్ధంగా నడిచినప్పుడు మనం ఎన్నో అగ్నిపరీక్షలకు లోనవ్వాల్సి ఉంటుంది. ఆశలనూ ఆనందా లనూ త్యజించి 'చివరి వరకూ పోరాటం సాగించామే అనుకో! మనకేం మిగులుతుంది? వృద్ధాప్యం! ఒంటరి వృద్ధాప్యం! అది ఎంత నరకమో నీకు తెలియదు. నువ్వు వేడిలో ఊహించనైనా ఊహించలేవు! కాని, నేను అన్నీ ఆలోచిస్తుంటాను! చదువు మానేసి ఇంట్లో కూర్చొన్న ఈ మూడేళ్ళలో నాకొచ్చే ఆలోచనలన్నీ ఇవే! అందుకే నేను నీలా 'వరకట్నం తీసుకొనేవాడిని పెళ్ళిచేసుకోను' అని ప్రతిజ్ఞ చేయలేకపోయాను!" అంది జ్యోతి.

ప్రతిజ్ఞ చేసినంతమాత్రాన మనకు పెళ్ళి కాదని ఎందుకు నిరాశపడాలి? కట్నం తీసుకోకూడదన్న ఆదర్శయువకులు తటస్థ పడరా?"

"అమ్మో! కులాంతరమో,మతాంతరమో అయితే తప్ప అలాంటి ఛాన్స్ తగలదు! ముందు మనం ప్రేమ అనే గోతిలో పడాలి! ఆ గోతిలోంచి బయట పడడానికి వాడు నమ్మక ద్రోహం చేయకుండా చేతినంది వ్వాలి! అదృష్టవశాత్తూ అందించాడనుకో అవతలికి వెళ్ళాక మన పెద్దల సహకారం ఉండదు కనుక మన పెద్దలతో పూర్తిగా కనెక్షన్సు తెగిపోతాయి! మన అదృష్ట దుర దృష్టాలు అన్నీ వాడి చేతిలోనే! ఏమైనా విరుద్ధం జరిగిందా మనం ఒంటరిగా పోరా డాలి! పెద్దల సానుభూతి వుండదు! సమా జం సానుభూతి ఉండదు! పైగా ఈ పెళ్ళి ఎందుకు చేసుకొన్నానా అని పశ్చాత్తా పపడేందుకు సర్వ విధాలా ప్రయత్నిస్తూ ఉంటారు! ఎందుకొచ్చిన గొడవ! చక్కగా వాళ్ళు తెచ్చిన సంబంధం చేసుకొని వెళ్ళి పోక! ఏం జరిగినా వాళ్ళదే బాధ్యత కదా?"

"ఇలా ఎవరికి వాళ్ళుతమ స్వార్థాన్ని

చూచుకొని వరకట్న పిశాచానికి ఊపునూ హుషారునూ ఇస్తూంటే అదింకా వికటాట్ట హాసం చేస్తూ ఎన్ని మధ్య తరగతి కుటుం బాలను కూలుస్తుందో తెలుసా? నేను మాత్రం చివరికి వృద్ధ కన్యగా మిగిలిపోయినా సరే! వరకట్నంతో జరిగే పెళ్ళిని చేసుకోను! ఇప్పటి నుండి నా జీవిత లక్ష్యం ఏమిటి తెలుసా? నాలాంటి ఆదర్శాలుగల యువత లను సమీకరించి, ఒక ఉద్యమంగా రూపు దాల్చి ఈ వరకట్న పిశాచాన్ని నేలంటూ కూల్చడానికి పోరాటం సాగిస్తాను."

○ ○ ○

సుధ ఆలోచనలు, ఆదర్శాలు వింటున్న కొద్దీ వెటకారం చేసి ఎత్తి పొడవడం మొదలు పెట్టారు ఇంట్లోనూ బయటా.

"నువ్వేం అపురూపమైన రంభవని, ఐ. ఎ. ఎస్; ఆఫీసరువని, లేదా డాక్టరువని నిన్ను కట్నం లేకుండా చేసుకొంటానని వస్తాడే? కట్నం ఇచ్చేది మేం! కష్టాలు పడేదిమేం! ఒకింటికి వెళ్ళిపోయే దానికి నీకెందుకు బాధ? ఆడపిల్లల్ని కన్న తరువాత కన్నవాళ్ళు వాళ్ళపెళ్ళి పేరంటానికి కష్టార్జిత మంతా ధారబోయడం దేశమంతా ఉంది! మేం ఒక్కరమే ఈ బాధ పడటంలేదు!" అంది తల్లి.

సుధ ప్రతిజ్ఞ గురించి విన్నవాళ్ళంతా ఇదే అభిప్రాయం వ్యక్తపరిచారు.

కన్నవాళ్ళకి, సమాజరీతికి ఎదురు తిరిగి నడవాలనుకొన్నప్పుడు ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడకూడదని గ్రహించి, సుధ ఎం. ఎ. చదివే ప్రయత్నం మానేసి ఉద్యోగ ప్రయత్నంలో పడింది.

○ ○ ○

ఆ రోజు సుధ ఒక ప్రైవేట్ కంపెనీ ఇంటర్వ్యూకి వెళ్ళి అప్పుడే వచ్చింది ఇంటికి.

తల్లి సంతోషంగా ఎదురొచ్చింది.

"నీ ప్రతిజ్ఞ విని మేం అంతా అయ్యేదా, పొయ్యేదా అని నవ్వాం! కాని ఇప్పుడు నీ ప్రతిజ్ఞే చెల్లుతూంది! నీ సంకల్పబలం అలా ఉందన్నమాట

"సంగతేమిటమ్మా?"

"విజయలక్ష్మి ఆంటీ అక్క కొడుకు నిన్ను వాళ్ళింట్లో అప్పుడప్పుడూ చూసే వాడట! నీ ప్రతిజ్ఞ గురించి విజయలక్ష్మి ఆంటీ చెప్పగా విన్నాడట! కట్న కానుకలు లేకుండా నిన్ను పెళ్ళాడతానని విజయలక్ష్మి ఆంటీ ద్వారా కబురు పంపాడు. అయితే, ఉద్యోగం తప్పనిసరిగా చేయాలని కండిషన్ పెట్టాడట."

"ఇంకేం? కట్నం ఒకేసారిగా తీసుకోకుండా నెలనెలకి వెయ్యి పన్నెండు వందలు చొప్పున ఇన్‌స్టాల్‌మెంట్‌గా తీసుకొంటా డన్నమాట!"

"అతడి మాటకు పెడర్థం తీయడం దేనికి? నువ్వెలాగూ ఉద్యోగం చేయాలను కొంటున్న దానివేగా? వేడినీళ్ళకు చన్నీళ్ళని ఎంతమంది గృహిణులు ఉద్యోగాలు చేయ డం లేదు? కట్నం లేకుండా నిన్ను పెళ్ళి చేసుకొంటున్నప్పుడు వాళ్ళ తలిదండ్రులకు కోపం రాకుండా, ఇదిగో! ఉద్యోగంచేసే కోడల్ని తెచ్చాను! అని చెప్పుకోడానికైనా ఉంటుందిగా అతడికి?"

"నా ఇష్టముంటే చేస్తాను, లేకుంటేలేదు కండిషన్ ఎందుకు పెట్టాలి? కండిషన్ ఎందుకు పెడుతున్నాడో తెలుసా? నా జీవితంమీద పూర్తిగా హక్కులు పొంద డానికి: నా జీవితంమీద నాకే హక్కు లేకుండా చేయడానికి?"

"అయితే ఇప్పుడేమంటావు? చేసుకో నంటావా?" ఒళ్ళు మండినట్టుగా అడిగింది తల్లి.

"ఆ కండిషన్ పెడితే చేసుకోను!" ఖచ్చితంగా చెప్పేసింది సుధ.

కట్నం కోసం పెద్దగా ప్రయాస పడ



కుండా, కూతురి పెళ్ళి పోతుందన్న సంతోషం మిగలకుండా చేసిన కూతురిపై గొంతుదాకా కోపం వచ్చింది సరస్వతికి:

"ఏమంది సుధ?" అని విజయలక్ష్మి అడిగినప్పుడు సరస్వతి చిరచిరలాడుతూ, "దాని పెళ్ళి సంగతి నా దగ్గరెత్తకండి: ఏమైనా తగలడనీ అది:" అంది.

చేసుకోనందా! నేనప్పుడే అనుకున్నాను. అన్నాను కూడా మా ఆనంద్‌తో! మగ పిల్లాడి వాళ్ళం: మనకై మనం అడిగితే లోకువరా, అదీ కట్నం తీసుకోకుండా చేసుకొంటానంటే మరీ లోకువరా అని: కట్నం అక్కర లేదంటే, 'ఏం లోపముందో? ఎవరూ పిల్లనివ్వడం లేదేమో!' అనంటారని అప్పుడే అన్నాను!" విజయలక్ష్మి జేవురించిన ముఖంతో అంది.

"అదేం కాదండి, విజయలక్ష్మిగారూ! ఉద్యోగం చేయాలన్న కండిషన్ దానికి నచ్చలేదట! ఉద్యోగం చెయ్యడం, చెయ్యక పోవడం తనిష్టమట!"

"ఇప్పుడంటే ఇప్పుడు ఉద్యోగం చేయాలన్న పట్టుదలతో కాళ్ళరిగేలా తిరుగుతూందిగా? వాడు ఉద్యోగం చేయాలని కండిషన్ పెడితే ఇప్పుడు క్రొత్తగా వచ్చే కష్టమేమిటి?"

"అదేమో నాకు తెలియదు, తల్లీ!"

"ఇలాంటి విపరీతపు బుద్ధి పిల్లను పెళ్ళి చేసుకొని వాడేం సుఖపడతాడు? మళ్ళీ ఈ పెళ్ళి సంగతి నా దగ్గరెత్తొద్దని చెబుతాను వాడికి!"

"దాని అదృష్టం ఎలా ఉందో ఎవరికి తెలుసు? ఎదురొచ్చిన అదృష్టాన్ని కాల దన్నుకొంది ఏం చేస్తాను? దాని ఖర్మ!"

ఆ విషయం అక్కడితో ముగిసిపోయి నట్టే అనుకొన్నారు గాని, ఆనంద్ అంత టితో వదిలి పెట్టలేదు, "ఒకసారి నేను సుధతో మాట్లాడతాను! తన అభిప్రాయం సూటిగా తెలుసుకొంటాను! సుధని పిలువు, పెద్దమ్మా" అన్నాడు.

"నీకెంత సిగ్గులేదురా, నాయనా! అడిగి అడిగి చేసుకోవల్సిన ఖర్మేమిటి? మగ పిల్లాడివి! పాతిక ముప్పైవేలు కట్నం ఇచ్చి పిల్లనిస్తానని నీ కోసం తిరుగుతూంటే, ఈ చండిక కోసం నువ్వు తిరగడం ఏమిటి?" బుగ్గలు నొక్కుకొంది విజయలక్ష్మి.

"ఎంతసేపు ఆడపిల్లవాళ్ళే మగపిల్లవాడి వెంట తిరగాలి! మగపిల్లవాడు తిరగడం నామోషి! మీ ఆడవాళ్ళే ఆడవాళ్ళని ఎందుకు చిన్నబుచ్చుకొంటారో తెలియదు!" అన్నాడు ఆనందరావు, పెద్దమ్మకి ఓచురక తగిలిస్తూ." ఆడపిల్ల నాకు నచ్చినపుడు ఒకటికి రెండుసార్లు అడిగితే తప్పేముంది?'

"అయితే, నీ ఇష్టం నాయనా: మధ్యన నేనెందుకు? నువ్వే వాళ్ళింటికి వెళ్ళి సూటిగా అడుక్కో: ఒప్పుకోకపోతే ఆ పిల్లకాళ్ళు పట్టుకో!"

బస్‌స్టాప్‌లో నిలబడి బస్ కోసం చూస్తుంది సుధ.

"సుధగారూ!"

సుధ తలత్రిప్పి చూసింది! ఆనందరావు

"ఎక్కడికో వెడుతున్నారు?"

"మా ఫ్రెండ్ ఇంటికి వెడుతున్నాను!"

"ఇప్పుడు అర్జంటుగా వెళ్ళాలా? తొందరేం లేకపోతే అలా పార్కుదాకా నడిచి పదినిముషాలు మాట్లాడుకొందాం!" రిక్వెస్టు చేస్తున్నట్టుగా అన్నాడు ఆనంద్.

"నిన్నటి తన జవాబుకు మామూలు మగవాడైతే తనకేసి జన్మలో తిరిగి చూసే వాడుకాదు! అలా చేయలేదంటే ఈయన ఓ మెట్టుపైకి ఎదిగి ఉండాలి! సరే, చూద్దాం! ఏపాటి ఎదిగాడో!" అనుకొని, "సరే, పదండి!" అంది సుధ.

పది నిముషాల తరవాత ఒకపార్కులో కూర్చున్నారు ఇద్దరు.

అతడు కంఠం సవరించుకొని, నెమ్మదియైన స్వరంతో మొదలు పెట్టాడు: "కట్నం తీసుకునేవాడిని పెళ్ళి చేసుకో కూడదన్న మీ ఆదర్శం నాకు నచ్చింది! మీరు కూడా నచ్చారనుకోండి: నచ్చబట్టే గా అంతట నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానని కబురు చేశాను! ఉద్యోగం చెయ్యాలని కండిషన్ ఎందుకు పెట్టానంటే కట్నం తీసుకోకుండా నేను పెళ్ళి చేసుకొంటున్నందుకు మావాళ్ళు మనమీద దాడి చేయకుండా ఉండేందుకు, 'ఇదిగో, సంపాదించే కోడల్నే తెచ్చానుగా?' అని చెప్పేందుకు: అంతేగాని, మీచేత ఉద్యోగం చేయించి నేను వేరే మేడ కట్టుకుందుకుకాదు."

మీ తరపున మీ కండిషన్ సమర్థనీయమే కావచ్చు: కాని నా మట్టుకు నా వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టినట్టుగా అనిపిస్తూంది. కట్నం లేనందుకు పరిహారంగా ఇవాళ ఉద్యోగం చేయమంటారు! రేపు ఇంకేదైనా చెయ్యమంటారు; రేపు కోపం తెచ్చుకొని నాలుగు తిట్లో రెండు కొట్లో కట్నం తీసుకురానందుకు ఇవి పడకూడదా అని కూడా అనొచ్చు."

"బాబోయ్! ఎంత దారుణంగా ఆలోచిస్తారు మీరు." ఆనంద్ గాభరాగా అన్నాడు," సరే! మీరు ఉద్యోగం చెయ్యక పోయినా నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను! ఇప్పుడైనా మన పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా, సుధాదేవిగారూ?"

"కట్నం లేకున్నా, మీరు కోరినట్టుగా ఉద్యోగం చేయకున్నా నా మీద ఈ ఇంట రెస్ట్ ఏమిటో?" ఓరగా చూసింది సుధ. అతడికేసి.

"కట్నం తీసుకోనేవాడిని పెళ్ళాడనని ప్రతిజ్ఞ పట్టే ఆదర్శ యువతులేకాదు, కట్నా


-నూతన సంవత్సర శుభాకాంక్షలు-

ప్రతివారి ఇంట వుండవలసిన అపూర్వ గ్రంథములు

- శ్రీవాల్మీకి రామాయణము-వచనము
  ఎనిమిది భాగములు రూ. 130/-
  (కంబైండు) రూ. 140/-
- శ్రీమహాభాగవతము-వచనము
  మూడు భాగములు 75/-
- శబ్దార్థ రత్నాకరము
  తెలుగు-తెలుగు డిక్షనరీ రూ. 60/-
- గానకళాబోధిని
  గొప్ప సంగీత గ్రంథము రూ. 80/-
- వేమన పద్యరత్నాకరము
  2,500 పద్యములు-తాత్పర్యంతో రూ.25/-
- హిందీ-తెలుగు కోష్ రూ. 30/-
- తెలుగు-ఇంగ్లీషు డిక్షనరీ రూ. 75/-
- బృహత్‌స్తోత్ర రత్నాకరము
  పార్ట్ I & II (దేవి, శివ) రూ. 50/-
- వాత్స్యాయన కామసూత్రాలు
  (బొమ్మలతో) రూ. 15/-
- గీతగోవిందం-అష్టపదులు
  (చిత్రాలతో) రూ. 10/-
- శివపురాణము రూ. 10/-
- మాఘపురాణము రూ. 7/-
- కార్తీక పురాణము రూ. 5/-
- ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి రూ. 35/-
- శ్రీమదాంధ్ర మహాభారతము [వచనము]
  ఆదిపంచకము రూ. 115
  యుద్ధషట్కము రూ. 100/-
  శాంతిసప్తకము రూ. 125/-
  (విడి విడి భాగములు కూడ దొరుకును.)
- మనుచరిత్ర రూ. 8/-
- యోగాసనములు రూ. 9/-
- శ్రీమద్భగవద్గీత (శ్లో॥,తా॥) రూ. 12/-
- స్తోత్రకదంబము రూ. 10/-

వలయువారు అడ్వాన్సుతో ఆర్డరు పంపవలయును.

ఇవికాక సహస్రనామాలు, శతకములు, నావల్సు, గైడ్సు, ఇతర ప్రచురణలు కూడా మావద్ద లభించును.

బాలసరస్వతీ బుక్ డిపో., (టి. వెంకటేశ్వర్లుశెట్టి ఛాంబర్సు) 4. నంబురామశెట్టి వీధి, మద్రాసు-1

నికి అమ్ముడుపోని ఆదర్శ యువకులు కూడా ఈ సమాజంలో ఉన్నారని చెప్ప డానికి! కేవలం పైపై మెరుగులు చూసికాదు వ్యక్తిత్వాన్ని చూసి ఆకర్షింప బడేవాళ్ళు కూడా ఉన్నారని చెప్పడానికి!" ఆనంద్ కళ్ళలో అనురాగపు తళుకులీనగా చిలిపిగా అన్నాడు.

"ఇప్పుడు నాకెంతో ధైర్యం వచ్చిం దండీ! నేను కట్నం తీసుకొనేవాడిని పెళ్ళా డనని ప్రతిజ్ఞ పట్టినప్పుడు నేను వృద్ధ కన్యగా మిగిలి పోతానని అందరూ హెచ్చ రించారు. అయినాసరే, అదే ప్రతిజ్ఞకు కట్టు బడి ఉండాలను కొన్నాను. వృద్ధ కన్యలుగా మిగిలి పోవలసి వస్తుందేమోనని వెనుకడుగు వేసే యువతులకు మిమ్మల్ని చూపి, 'ఇదుగో మన ప్రతిజ్ఞ నెరవేర్చుకోడానికి ఆదర్శ యువకులకు మరీ అంతకరువేం రాలేదు' అని చెబుతాను! నా ప్రచారాన్ని ఇంకా ఉధృతం చేస్తాను! నాలా ఓ వందమందిని తయారుచేసి, ఆ వందమందీ ఒక్కొక్కరు వంద మంది చొప్పున నాలా తయారు చేస్తూపోతే వరకట్న పిశాచం అంతమై పోదా?"

"తప్పకుండా అంతమై పోతుంది, సుధా కాని ఏ మార్పు ఈ సమాజంలో వస్తే బాగుంటుంది అనుకుంటామో, ఆ మార్పు ముందు మన జీవితాలలో, మన ఇంటిలో. ప్రవేశ పెట్టాలి! 'ఈ వరకట్న పిశాచం ఎప్పుడు అంతమై పోతుందో! దీనివల్ల కొంపలు కూలి పోతున్నాయి! అంటూ శాప నార్థాలు పెట్టే ఒక ఆడపిల్ల తల్లి, తమ ఒక కొడుకు తల్లి అని గుర్తుకురాగానే కోడలు కుప్పలు తెస్తే బాగుంటుందని కలలు కంటుంది! 'మేం ఇవ్వడం లేదా? మేం తీసుకొంటే తప్పేమి'ట్నని 'సమర్థించు కొంటుంది పైగా! కాని, 'నేనివ్వను! నేను తీసుకోను!' అని చెప్పేతల్లి అరుదు. తండ్రి అరుదు.

"కట్నం తీసుకొనే వాడిని పెళ్ళాడనని చెప్పే యువతులను తయారు చేయడం ఒక్కటే కాదు! 'నేనివ్వను! నేను తీసుకోను అనే తలితండ్రులను కూడా మనం తయారు చేయాలి, ఈ రోజునుండి నీ జీవిత భాగ స్వామిని అనడంతో పాటు నీ ఉద్యమంలో భాగస్వామిని కూడా అవుతాను!"

సుధకి ఆనంద్ ఎంతో ఎదిగిపోయిన వాడుగా కనిపిస్తూంటే, అప్పుడే చిగు రిస్తున్న అనురాగంతో అతడిని అభిషేకి స్తున్నట్లుగా చూస్తూ, తృప్తి, ఆనందం నిండిన కంఠంతో, "ఇంత గొప్పవారు... నన్ను వెదుకుతూ వచ్చి నా చేతికి మీ చేతి నందించి నాతో సాగివస్తున్నారంటే, అదృష్టం ఎంత చిత్రంగా మనిషిని వరి స్తుందాని విస్మయం కలుగుతూంది నాకు. అంది. "ఈ సందర్భంగా మిమ్మల్ని మరో కోరిక కూడా కోరదలుచు కొన్నానండీ!"

"ఏమిటది?"

సుధ రాధ గురించి చెప్పి, "ఆ దుర్మా ర్గుడు దాన్ని తన రాక్షసపు పాదాలక్రింద అణచి పెట్టి కాళ్ళ సందున ఇరికించుకొన్న కోడిపిల్లను డేగ కొద్దికొద్దిగా పీక్కు తింటు న్నట్టుగా పీక్కు తింటున్నాడు. చివరికి ఓ నాడు దాని ప్రాణాన్ని హరించినా ఆశ్చర్యం లేదు. దాన్ని ఎలాగైనా రక్షించుకోవాలి. అందుకు మీ సహాయం కావాలి నాకు!" అంది ప్రార్థనగా.

"ముందు ఆమెకు భర్త అనేవాడు లేకున్నా బ్రతికే ధైర్యం నూరి పోయాలి మనం. తరువాత ఆమె స్వతంత్రంగా తన బ్రతుకు తాను బ్రతికేట్టుగా చేయాలి! ఈ ప్రయత్నంలో నాపూర్తి సహకారం ఉంటుంది నీకు సుధా."

"సహృదయుడైన భర్త సరసన ఉంటే ఆడది ఎన్ని పనులైనా చేయగలదని నిరూ పిస్తానండీ!" సుధ ఉత్సాహంగా అంది. ●

నూతన సంవత్సర శుభాకాంక్షలతో!...
శ్రీవంశీకృష్ణా వారి వినూత్న నవలా దీపికలు!
* డిశంబర్ 21 విడుదలయ్యాయి!
చందు సోంబాబు - ఇదిగో కన్నీరు దానికళ్ళు పట్టండి - రూ. 26/-
యం.డి. చైతన్య - శిథిల సహాలు (ఆపని సీరియల్) ........ రూ. 18/-
దమయంతీ చౌదరి - ప్రేమాగ్ని ........ రూ. 13/-
పాలకోడేటి సత్యనారాయణరావు - ప్రేమసంజీవని ...... రూ. 12/-
* నవంబర్‌లో విడుదలయ్యాయి! కొద్దికాపీలే వున్నాయి!
యర్రంశెట్టి సాయి - హనీమూన్ ........ రూ. 17/-
చందు సోంబాబు - క్రాంతి ........ రూ. 24/-
నేడే అడ్వాన్స్‌తో మీ ఆర్డరు పంపండి!
తొందరలో విడుదల! చందు సోంబాబు
శ్రీవంశీకృష్ణ పబ్లికేషన్స్
గాంధీనగర్, విజయవాడ-3 ఫోన్: 74331

ముస్తాబులో మార్పు!


సరిక్రొత్త ఆకర్షణీయమైన సీసాలలో
లోధ్ర
బాధారహిత ప్రకృతి సిద్ధమయిన ఆరోగ్యమును స్త్రీలకు 80 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ కూపనును పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ____________
విలాసము: ____________
____________ PIN ______
ఏజంట్లు:
సీతారామ్ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్,
విజయవాడ - సికిందరాబాద్
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14